క్లుప్తంగా

పల్‌రెడ్డి వెంకట్‌రెడ్డికి నివాళి



వెంకట్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న బుసిరెడ్డి పాండురంగారెడ్డి

నిడమనూరు : మండలంలోని శాఖాపురం గ్రామానికి చెందిన రైతు నాయకుడు పల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి (85) మృతికి బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి నివాళులర్పించారు. వెంకట్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతిమయాత్రలో పాల్గొని నివాళులర్పించారు. వెంకట్‌రెడ్డి మృతికి తిరుమలగిరి-సాగర్ వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌కుమార్, చామల యాదగిరిరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, చామల జయంత్‌రెడ్డి, బుసిరెడ్డి మట్టారెడ్డి, వెంకట్‌రెడ్డి, భాస్కర్, సంతోష్‌రెడ్డి, నాగార్జున రెడ్డి, రమేష్‌చారి, షేక్ అబ్దుల్ కరీం, శాఖాపురం మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి నివాళులర్పించారు.

యాదవ సంఘం నూతన కమిటీ ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సంఘ సభ్యులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండలోని పాత బస్తీలో గల శ్రీకృష్ణ నగర్ యాదవ సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పేరం మల్లేష్ యాదవ్ ఎన్నికయ్యారు. 94 ఓట్ల మెజార్టీతో ఎల్లంల యాదయ్యయాదవ్‌పై ఆయన విజయం సాధించారు. శ్రీకృష్ణ నగర్ యాదవ సంఘంలో మొత్తం 456 ఓట్లు ఉండగా 394 ఓట్లు పోలయ్యాయి. అదే విధంగా యాదవ సంఘం యూత్ అధ్యక్షుడిగా ఉడుత సైదులుయాదవ్ 100 ఓట్ల మెజార్టీతో కునుకుంట్ల ఉపేందర్‌పై విజయం సాధించారు. కార్యక్రమంలో యాదవ సంఘం గౌరవ అధ్యక్షుడు గుండెబోయిన మల్లయ్య యాదవ్, పండగ నాగరాజు, జై లింగస్వామి, మండలి నాగరాజు, పండుగ వెంకన్న, పేరం సైదులు, గంగయ్య, పి.లింగయ్య, మద్ది ఎల్లయ్య, లోహిత్ తదితరులు పాల్గొన్నారు.

చెట్ల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలి



గుట్టల ప్రాంతంలో విత్తన బంతులు చల్లుతున్న సూపరింటెండెంట్, సిబ్బంది

హుజూర్‌నగర్ : ప్రతిఒక్కరూ చెట్ల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలని హుజూర్‌నగర్ సబ్ జైల్ సూపరింటెండెంట్ మంగతా అన్నారు. ఆదివారం స్థానిక సబ్ జైల్ సిబ్బందితో కలిసి పట్టణ శివారులోని మిట్స్ కాలేజీ పరిసర ప్రాంతంలో గల గుట్టల ప్రదేశంలో వివిధ విత్తన బంతులు (సీడ్ బాల్స్) చల్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖాళీ ప్రదేశాల్లో చెట్లు పెంచాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగం కావాలని కోరారు. కార్యక్రమంలో జైల్ హెడ్ వార్డర్ మంత్రిప్రగడ సీతయ్య, వార్డర్లు భాస్కర్, ప్రవీణ్, అజయ్ పాల్గొన్నారు.

భగవద్గీత పఠనంతో జ్ఞానం పెంపొందుతుంది

హుజూర్‌నగర్ : భగవద్గీత పఠనంతో జ్ఞానం పెంపొందుతుందని భగవద్గీత ప్రచారకులు హషికేశ దాస్ అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్‌లోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి సత్రంలో భగవద్గీత సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగవద్గీత చదవడం వల్ల మనస్సును ఎలా నియంత్రించుకోవాలి, జీవన విధానం ఎలా ఉండాలి, మనిషి మనోవైఖరి ఎలా ఉండాలనేది అర్థమవుతుందని తెలిపారు. మానవుడు భగవద్గీతను అనుసరించి జీవించాలన్నారు. అప్పుడే అతని జన్మ సార్థకమవుతుందని చెప్పారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక సంఘం నాయకులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కంకర పరిచారు.. బీటీ మరిచారు

- రెండేళ్లుగా పూర్తికాని రోడ్డు నిర్మాణ పనులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



కంకర పరిచి మధ్యలో వదిలేసిన రోడ్డు



రోడ్డు నిర్మాణ శిలాఫలకం

కొండమల్లేపల్లి : గ్రామాలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పలు పథకాల అమలులో భాగంగా గ్రామాలను కలుపుతు రోడ్ల నిర్మాణాలను చేపట్టింది. అందులో భాగంగా కొండమల్లేపల్లి మండల పరిధిలోని కేశ్యతండా గ్రామం నుంచి కొత్తబావి, హంక్యతండా వరకు బీటీ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. ఈ బీటీ రోడ్డు నిర్మాణానికి ఎస్టీ ఎస్‌డీఎఫ్ నిధుల కింద రూ.3.20కోట్లతో సెప్టెంబర్ 2023లో అప్పటి గిరిజన సంక్షేమశాఖ, స్త్రీ శిశు శాఖమంత్రి సత్యవతి రాథోడ్, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. కాని ఇప్పటి వరకు ఈ రోడ్డు నిర్మాణ పనులు మాత్రం పూర్తి కాలేదు. కాంట్రాక్టర్ మాత్రం బిల్లులు రావడం లేదని కంకర పోసి పనిని మధ్యలోనే ఆపేశాడు.

ప్రమాదాలు జరుగుతున్నా..

బీటీ రోడ్డు నిర్మాణంలో భాగంగా గుత్తేదారు మట్టి పోసిన అనంతరం సుమారు ఆరు నెలల క్రితం వైట్‌మిక్స్ (కంకర) పోశారు. దీని వల్ల రోడ్డుపై ప్రయాణం చేసే వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇమ్మందులు పడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, ఆటోలో వెళ్లేవారు తమ వాహనాలు అదుపు తప్పి ప్రమదాలు జరిగిన సందర్భాలు చాలానే ఉన్నాయని తండావాసులు పేర్కొంటున్నారు. ఈ కంకర రోడ్డుపై ప్రయాణం నరకాన్ని తలపిస్తుందని పాదాచారులు వాపోతున్నారు. ఇప్పటికైన ప్రభుత్వ అధికారులు స్పందించి కంకర పై బీటీ పోసే విధంగా వేగంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

త్వరలోనే బీటీని పూర్తిచేయిస్తాం

కేశ్యతండా గ్రామం నుంచి కొత్తబావి, హంక్యతండా వరకు చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. దీనికి ప్రధాన కారణం బడ్జెట్ లేకపోవడంతో బిల్లులు ఆలస్యం కావడంతో గుత్తేదారు రోడ్డు నిర్మాణ పనులను కంకర వరకు పోసి వదిలివేశారు.దీనికి సంబంధించి పై అధికారులతో మాట్లాడి బిల్లులు సకాలంలో వచ్చేవిధంగా చూస్తాం. గుత్తేదారుతో మాట్లాడి రోడ్డు పనులను త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

– నవీన్, ట్రైబల్ ఏఈ

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, తదితరులు

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మాడుగులపల్లి : గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పాములపాడు, పోరెడ్డిగూడెం, చిరుమర్తి, ఆగామోత్కూర్, గుర్రప్పగూడెం, కల్వలపాలెం, బొమ్మకల్, భీమనపల్లి, తోపుచర్ల, గంధ్రవానిగూడెం, ఇసుకబావిగూడెం, కుక్కడం గ్రామాల్లో ఆయన పర్యటించి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో సంక్షేమ పథకాలు అర్హులకు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కాని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 18నెలల్లోనే 18పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తుందన్నారు. భూభారతి చట్టాన్ని తీసుకొచ్చి రైతుల ఇబ్బందులను తొలగించడంతోపాటు రైతు భరోసా, రైతు రుణమాఫీ అమలు చేసిందన్నారు. పేదలకు నూతన రేషన్‌కార్డుల పంపిణీ, సన్న బియ్యం పంపిణీ, 200యూనిట్లలోపు ఉచిత విద్యుత్, మహిళలకు ఫ్రీ బస్సు వంటి పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. మండలంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు తనవంతుగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సబ్బు హరికృష్ణారెడ్డి, పాలెట్టి ఉపేందర్, తీగల సతీష్, భూపతి ఉషయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, రంగారెడ్డి, మోహన్‌రెడ్డి, సతీష్ పాల్గొన్నారు.

దున్న పోతులగండి పనులు పరిశీలన

అడవిదేవులపల్లి : మండలంలోని చిట్యాల గ్రామ సమీపంలో సుమారు రూ. 220 వ్యయంతో నిర్మిస్తున్న దున్నపోతుల గండి లిఫ్ట్ పనులను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 13వేల ఎకరాలకు నీరందించే ఈ లిఫ్టును పూర్తిచేసి రైతులకు నీరందించాలన్నారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, బాలునాయక్, రంగ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

బనకచర్ల జల దోపిడీని అడ్డుకోవాలి

నల్లగొండ టూటౌన్: బనకచర్ల జల దోపిడీని అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం నల్లగొండలోని పలు సంక్షేమ హాస్టళ్లలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గాదె శివకుమార్, నోముల శంకర్ యాదవ్, వంటల చేతన్, సింగరి శివకుమార్, రాజు యాదవ్, స్వప్న, స్వాతి, రాధిక, దివ్య, సంధ్య పాల్గొన్నారు.

దరఖాస్తులను త్వరగా పరిష్కరించండి



సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీఓ అశోక్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ): భూ భారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని ఆర్డీఓ అశోక్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఆదివారం నల్లగొండ తహసీల్దార్ కార్యాలయంలో భూ భారతి దరఖాస్తులపై అధికారులు, సిబ్బందితో ఆర్డీఓ సమీక్ష సమావేశం నిర్వహించారు. పెండింగ్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు సమీక్షించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. విధుల్లో అలసత్వం వహించొద్దని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పరశురామ్, ఆర్ఐ ఎండీ.గౌస్, అక్తర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులు ఉద్యమాల్లో పాల్గొనాలి

నల్లగొండ టౌన్: ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడుస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమాల్లో వ్యవసాయ కార్మికులు పాల్గొనాలని మహిళా కూలీల జిల్లా కన్వీనర్ దండంపల్లి సరోజ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆహార భద్రత చట్టాన్ని అమలు చేసి ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టపర్చాలని పేర్కొన్నారు. రేషన్ షాపుల ద్వారా 14 రకాల వస్తువులను అందించాలని కోరారు.

నందికొండలో ఘనంగా బోనాల పండుగ



ముత్యాలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి, నాయకులు

నాగార్జునసాగర్ : నందికొండలో ఆదివారం భక్తులు బోనాల పండుగను అంగరంగవైభవంగా నిర్వహించారు. గ్రామదేవతలకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కాలనీల నుంచి ఆలయం వరకు మహిళలు బోనాలు ఎత్తుకొని ఫలహార బండ్లు, తొట్టెల, అమ్మవారి శకటాలతోపాటు పోతురాజుల విన్యాసాలు, డప్పు వాయిద్యాల మధ్య భారీ ఊరేగింపుతో వచ్చి దేవతలకు నైవేద్యం సమర్పించారు. హిల్‌కాలనీలోలోని తెలంగాణ చౌరస్తానుంచి డౌన్‌పార్కు ముత్యాలమ్మ వరకు, పైలాన్ బస్టాండు నుంచి పోచమ్మ ఆలయం వరకు ఊరేగింపు కొనసాగింది. నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ముత్యాలమ్మ ఆలయంలో పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆయనను శాలువాలతో సత్కరించింది. పైలాన్‌కాలనీలోని పోచమ్మ ఆలయంలో మాజీ కౌన్సిలర్ రామకృష్ణతో కలిసి జత గొర్రె పొటేండ్లను అమ్మవారికి సమర్పించి బోనమెత్తారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి(సాగర్) మండల మాజీ ఎంపీపీ భగవాన్‌నాయక్, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, రాంబాబు, రాజాప్రసాద్, నందికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్, మాజీ కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారికి నైవేద్యం సమర్పణ

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని మహిషాసురమర్దిని, ముత్యాలమ్మ, అంకాలమ్మ గ్రామ దేవతలను ఆదివారం బోనాలను మహిళలు సమర్పించారు. దీంతో పండుగ వాతవరణం నెలకొంది. ఆలయ ప్రధాన అర్చకులు వెల్లటూరి రాంమోహన్ శర్మ వేదమంత్రోత్సవాల మధ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పిల్లలు గణిత శాస్త్రవేత్తలుగా ఎదగాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

రామగిరి(నల్లగొండ): పిల్లలు గణితంలో పట్టు సాధించి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. ఇటీవల హైదరాబాద్ లోని శంషాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి గణిత ప్రాడజీ పోటీల్లో నల్లగొండ సిప్ అబాకస్ ఇనిస్టిస్యూట్ విద్యార్థులు ప్రతిభ కనబర్చిచారు. ఆదివారం నల్లగొండలోని సిప్ అబాకస్ ఇనిస్టిస్యూట్‌లో విద్యార్థులను ఆయన అభినందించి బహుతుమతులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ గణితంపై పట్టు సాధించేందుకు అబాకస్ కీలక సాధనంగా పనిచేస్తుందని అన్నారు. నల్లగొండ బ్రాంచ్ హెడ్ భవాని మాట్లాడుతూ ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 66 ఇనిస్టిస్యూట్‌ల నుంచి 3200 మంది విద్యార్థులు పాల్గొనగా నల్లగొండ నుంచి మొదటిసారిగా 22 మంది పాల్గొన్నారని తెలిపారు. అందులో 11 మంది విజేతలుగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో పల్లా దేవేందర్ రెడ్డి, కోర్స్ ఇన్‌స్ట్రక్టర్ స్పందన, నవనీత, ఎస్.మనుశ్రీ, యువిన్, విన్మయి, రీయాన్సిక, అభిజ్ఞ, దినేష్, కార్తీక్, దుర్గ వర్మ, రిషిధర్, షణ్ముఖ ప్రియా, కృతిక, నిద్విత్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ చెస్ దినోత్సవం

నల్లగొండ టూటౌన్: అంతర్జాతీయ చెస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం నల్లగొండలో చెస్ పోటీలు నిర్వహించారు. జిల్లా సెక్రటరి కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ పోటీలను ఐదు రౌండ్లలో స్విచ్ పద్ధతిలో నిర్వహించామన్నారు. ఛాంపియన్‌గా సాయి కమల్, 2వ స్థానంలో ఇందిర, 3వ స్థానంలో అభిమన్యు నిలిచారని తెలిపారు. విజేతలకు న్యూస్ స్కూల్ కరస్పాండెంట్ అనంతరెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ ఆర్బిటర్ విశ్వప్రసాద్ పాల్గొన్నారు.



చెస్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



త్రిపురారం : కూరపాటి సైదులు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి



హాలియా : నర్సమ్మ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

హాలియా : పట్టణానికి చెందిన పంగ వెంకటేశ్వర్లు అనారోగ్య కారణంగా ఆదివారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి పట్టణంలోని బాధిత నివాసానికి వెళ్లి మృతుడి సభ్యులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి మృతి చెందిన పంగ వెంకటేశ్వర్లు మృతదేహంపై పూల మాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు తన ప్రగాడ సంతాపం తెలిపారు. పరామర్శించిన వారిలో మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు గౌనీ రాజా రమేష్ యాదవ్, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పగడాల నాగరాజు, పీటీ శ్రీనివాస్, బూడిద గోవింద్ తదితరులు ఉన్నారు.

నర్సమ్మ కుటుంబ సభ్యులకు..

అనుముల మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు అలుగుల బ్రహ్మారెడ్డి తల్లి అలుగుల నర్సమ్మ మృతి చెందారు. ఆదివారం బ్రహ్మారెడ్డి నివాసానికి సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి వెళ్లి నరసమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. పరామర్శించిన వారిలో మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, ఆంగోతు భగవాన్ నాయక్, రాజప్రసాద్, ఎస్.పెద్దిరెడ్డి నాగిరెడ్డి, కొండారెడ్డి, రాజేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, రామాంజిరెడ్డి, అలుగుల రమణారెడ్డి, పాల్గొన్నారు.

త్రిపురారం : మండలంలోని పెద్దదేవుల పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు, నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కూరపాటి సైదులు అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. ఆదివారం ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి సైదులు మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మర్ల చంద్రారెడ్డి, కసిరెడ్డి నరేష్, గోపగాని శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమయ్య, బిట్టు రవి కుమార్, మాజీ ఎంపీటీసీ రాము, బాలకృష్ణ, సంతోష్ కుమార్, వెంకటేశ్వర్లు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్కెట్ డైరెక్టర్ మృతికి నివాళి

నిడమనూరు : నిడమనూరు మార్కెట్ డైరెక్టర్ కూరపాటి సైదులు అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం త్రిపురారం మండలం పెద్దదేవులపల్లిలో సైదులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నిడమనూరు మార్కెట్ వైస్ చైర్మన్ బుసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు సోమయ్య, మాజీ ఎంపీటీసీ అంబటి రాము, మార్కెట్ కార్యదర్శి తోట చందర్‌రావు తదితరులు నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మహాగర్జనను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న గోవింద్ నరేష్ మాదిగ

గుర్రంపోడు : హైదరాబాద్‌లో ఆగస్టు 13న నిర్వహించే పింఛన్‌దారుల మహాగర్జనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేశ్ మాదిగ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తలు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ అనేక సామాజిక సమస్యలపై పోరాటం చేస్తూ ప్రజల పక్షాన నిలబడిందన్నారు. ఆరోగ్యశ్రీ పథకం, వికలాంగుల, వృద్ధుల వితంతుల ఇతర పింఛన్లను పెంచాలని పోరాడి విజయం సాధించిందని తెలిపారు. తెల్ల రేషన్‌కార్డుదారులకు ఆరుకిలోల బియ్యం పెంపు, అత్యాచారాల నిరోధానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటు, అట్రాసిటీ కేసుల పునరుద్ధరణలపై పోరాడిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం మాదిగ, నాయకులు కొమిర స్వామి, ఏర్పుల వెంకటయ్య, తరి వెంకటయ్య, పోలేని యాదయ్య, పోలేని ముత్యాలు, నిరసనమెట్ల బాలు, మేడి వెంకన్న, పోలేని నర్సింహ్మా, నర్సింహ్మా, పెద్దులు, శ్రీను వివిధ మండలాల భాద్యులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం ఏర్పాటు అభినందనీయం



వైద్యశిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రవీందర్‌రెడ్డి

హాలియా : గ్రామీణ ప్రాంత నిరుపేద ప్రజలకు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా రైస్ మిల్లర్స్ గౌరవ అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి అన్నారు. ఆదిత్య ఆస్పత్రి, హాలియా లయన్స్ క్లబ్, నల్లగొండ రివర్ నిమ్స్ ఆస్పత్రి, గ్యాస్ట్రో ఎంట్రాలజీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆదిత్య ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గ్యాస్, లివర్ వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ హాలియా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వీరమళ్ల శ్రీనివాస్, డాక్టర్ నులక రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత నిరుపేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 750 మంది పాల్గొనగా వారికి పలువురు డాక్టర్లు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీబ సతీష్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, లయన్స్ క్లబ్ కార్యదర్శి సక్రునాయక్, కోశాధికారి రామకృష్ణ, సభ్యులు పేలపూడి బాలకృష్ణ, నిమ్మల లక్ష్మారెడ్డి, చీదళ్ల లింగయ్య, నులక వెంకట్ రెడ్డి, గుండా కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, వెంకట్‌రెడ్డి, రామాంజిరెడ్డి, రాంబాబు, రేపాల వెంకన్న, శ్రీను బాబు, తరి రాము, డాక్టర్లు వెంకట్‌రెడ్డి, కీర్తిరెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, సుధా, ఇంద్రసేన్, నిరంజా, స్వర్ణదిప్తి తదితరులు ఉన్నారు.

నిరుపయోగంగా స్వీపింగ్ మిషన్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణంలో ప్రధాన రోడ్లను శుభ్రం చేసేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.60 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన స్వీపింగ్ మిషన్ ఏడాదిన్నరగా నిరుపయోగంగా ఉంటోంది. మున్సిపాలిటీలో శాశ్వత ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికులు ఉన్నప్పటికీ స్వీపింగ్ మిషన్‌ను కొనుగోలు చేయడంపై సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఇది కొనుగోలు చేశాక ఐదుసార్లు మాత్రమే నాగార్జునసాగర్ రోడ్డులో తిప్పి పక్కన పట్టేశారు. అసలు ఈ స్వీపింగ్ మిషన్‌ను ఎందుకు కొనుగోలు చేశారో మున్సిపల్ అధికారులకే అర్థంకాని పరిస్థితి నెలకొంది.



మిర్యాలగూడ మున్సిపల్ కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న స్వీపింగ్ మిషన్

నిర్వహణ లేక.. నిరుపయోగంగా!

- గ్రామాలకు దూరంగా వైకుంఠధామాలు
- శ్మశాన వాటికలను కమ్మేసిన కంపచెట్లు
- వినియోగంలోకి తీసుకురావాలంటున్న ప్రజలు



కొంపల్లి గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్మశానవాటిక



కంపచెట్లతో నిండి నిరుపయోగంగా ఉన్న యర్రచెరువుతండా వైకుంఠధామం

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : గ్రామాల్లో మరణించిన వారి అంతిమసంస్కారాలు నిర్వహించేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉపాధి హామీ నిధులతో వైకుంఠధామాలు నిర్మించింది. తిరుమలగిరి(నాగార్జునసాగర్) మండలంలో 34 గ్రామపంచాయతీల్లో ఈ శ్మశానవాటికలను నిర్మించారు. వీటిలో నీటి సౌకర్యం, విద్యుత్, స్నానాల గదులు సైతం ఏర్పాటు చేశారు. దీంతో అంత్యక్రియలు నిర్వహించడానికి గతంలో ఇబ్బందులు పడ్డ స్థానికులకు వీటి నిర్మాణంతో ఆ ఇబ్బందులు తీరాయి. కానీ రాను రాను వాటి నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం వహించడంతో ఆ శ్మశాన వాటికలను కంపచెట్లు కమ్మేశాయి. అంతేగాక పలు గ్రామాల్లో నల్లాలు, స్నానపు గదులు మరమ్మతులకు నోచుకున్నాయి. మండలంలో మెజార్టీ గ్రామ పంచాయతీల్లో గ్రామాలకు రెండు, మూడు కిలోమీటర్ల దూరంలో శ్మశాన వాటికల నిర్మాణం చేపట్టడంతో అంతిమయాత్రలో ఇబ్బందులు తప్పవని వాటిని వినియోగించిన దాఖలాలు మండలంలో ఎక్కడా లేవు. దీనికి తోడు శ్మశానవాటికలకు రోడ్డు నిర్మాణాలను చేపట్టకపోవడంతో ప్రజలు వీటిపై ఆసక్తి చూపించడం లేదు. గ్రామాల్లో ఎవరైనా చనిపోయినప్పుడు మళ్లీ గతంలో ఉపయోగించిన రోడ్ల వెంట ఉన్న స్థలాలనే ఉపయోగిస్తున్నారు. దీంతో ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన వైకుంఠధామాలు నిరుపయోగంగా మారడంతో ఆ నిధులు వృథాకావడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదని మండలవాసులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి ఇప్పటికైనా వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకొస్తాం



మండలంలో 34 గ్రామపంచాయతీల్లో శ్మశానవాటికల నిర్మాణాలు చేపట్టారు. కొన్ని గ్రామాల్లో వినియోగిస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో వివిధ కారణాలతో వినియోగించడం లేదు. అన్ని గ్రామాల్లో వినియోగంలోకి వచ్చేలా తీసుకొచ్చేలా కృషి చేస్తాం. వినియోగంలో ఉన్న గ్రామాల్లో ప్రజలు శ్మశానవాటికలను వినియోగించుకోవాలి.

– భిక్షంరాజు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ